# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు



WANTED విలేకరులు కావలెను

పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..

9866366702, 9963261745



సంపుటి : 01 | సంచిక : 137 | వరంగల్ | బుధవారం, 11 ఫిబ్రవరి 2026 | పేజీలు : 02




# మున్సిపల్ పోలింగ్‌కు సర్వం సిద్ధం

(ధీరావత్ శ్రీను నాయక్, పాలకుర్తి వాణి)

జనగామ, స్టేషన్ ఘన్పూర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నేడు పోలింగ్ ప్రక్రియని సజావుగా, ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ స్థానిక ఏకశిల బిఈడి కాలేజ్ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి కలెక్టర్ సందర్శించారు. మెటీరియల్ పంపిణి ప్రక్రియని, భోజనం, కౌంటింగ్ ఏర్పాట్ల ను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆర్డీవో గోపిరాం, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## స్టేషన్ ఘన్పూర్ లో సిపి సందర్శన

ఘనపూర్ స్టేషన్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ & రిసెప్షన్ సెంటర్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ సంయుక్తంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు చేపట్టారు 144 సెక్షన్ అమలులోకి ఉండనుంది.










## మహాశివరాత్రి జాతరకు
# కలెక్టర్‌కు ఆహ్వానం

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 14 నుండి 18 వరకు జరిగే మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కు ఆలయ అధికారులు ఆహ్వానించారు. ఆహ్వాన పత్రికను ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న, ఆలయ ప్రధాన అర్చకులు దేవగిరి లక్ష్మన్న మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వెళ్లి కలెక్టర్ కు అందజేశారు. అలాగే జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ కు ఆహ్వానం పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు దేవగిరి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## మహాశివరాత్రి జాతరను
# వైభవంగా నిర్వహించాలి

■ జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

**పాలకుర్తి వాణి, ములుగు:** ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతరను అన్ని శాఖల సమన్వయంతో ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో అదనపు కలెక్టర్ మహేందర్, ఆర్డీఓ వెంకటేష్, రామప్ప ఆలయ ఈవోలతో కలిసి సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. జాతర సందర్భంగా పారిశుద్ధ్యం, తాగునీరు, పార్కింగ్, రోడ్ల నిర్వహణ, విద్యుత్ సరఫరా, వైద్య శిబిరాలు, అగ్నిమాపక ఏర్పాట్లు, హెల్ప్ సెంటర్లు, సాంస్కృతిక కార్యక్రమాలపై శాఖల వారీగా రూపొందించిన ప్రణాళికలను అధికారులు వివరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగా అన్ని పనులు పూర్తి చేయాలని, భక్తుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైన చోట పందిర్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.





# జాతరలో మళ్లీ అవే పనులు

■ ప్రతిసారి మరమ్మతులతోనే లక్షల ఖర్చు

■ హవ్వ ఇదేమంటూ భక్తుల గుసగుసలు!

(ధీరావత్ శ్రీను నాయక్, సీనియర్ జర్నలిస్టు)

జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి దశాబ్దాల చరిత్ర ఉంది. ప్రతి ఏటా ఇక్కడ బ్రహ్మోత్సవాలు, మహాజాతరను వైభవంగా నిర్వహిస్తుంటారు. ఇదంతా బాగానే ఉన్నా.. జాతర పేరుతో ప్రతిసారి అవే పనులు, మరమ్మతు పనులు చేస్తుండడంతో లక్షల్లో ఖర్చవుతుంది. శాశ్వత పనులు చేపట్టకపోవడంతో వృధా ఖర్చు అవుతుందని భక్తులు వాపోతున్నారు. ఏటేటా ఇలా కోట్లలో దేవస్థానం ఆదాయంకు గండిపడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కానరాని శాశ్వత జల్లు స్థానాలు

కేవలం జాతర సమయంలోనే తాత్కాలిక జల్లు స్థానాలను ఏర్పాటు చేస్తారు. జాతర అనంతరం వాటి నిర్వహణ మరమ్మతులు లేకపోవడంతో అవి పాడవుతుంది. స్నానం కోసం నీటి తొట్టిలను సైతం అరకొరగానే ఏర్పాటు చేయడంతో భక్తులు పుణ్య స్థానాలు ఆచరించడానికి ఏటేటా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు, పాలకులు జోక్యం చేసుకొని శాశ్వత జల్లు స్థాన ఘట్టాలు, నీటి తొట్టిలను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. మలమూత్రశాలల కోసం మరుగుదొడ్ల ఏర్పాటు కూడా అంతంత మాత్రమే ఉంటాయి. దీంతో



భక్తులు బహిరంగ ప్రదేశాలను ప్రతిసారి ఆశ్రయిస్తుంటారు. శాశ్వత మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యుత్ సరఫరాకు స్తంభాల ఏర్పాటు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా విద్యుత్ సరఫరా కోసం ప్రతిసారి లక్షలల్లో ఖర్చు చేస్తున్నారు. విరివిగా స్తంభాలు, నియంత్రికలు, తీగల ఏర్పాటు చేపడుతుంటారు. వీటిని తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా ఉండేలా ఏర్పాటు చేస్తే బాగుంటుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు. అలాగే క్షీరాద్రి చుట్టూ నిరంతరం విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలి అంటున్నారు. పాలకుర్తి పట్టణంలో ఆలయ చరిత్ర గానం రూపంలో తెలిసేలా మైకులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. వీధుల్లో సైతం ప్రతిధ్వనించేలా చర్యలు తీసుకోవాల్సి ఉందంటున్నారు.



### ఉన్నతాధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్తాం

**మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో తాత్కాలిక పనులు కాకుండా శాశ్వత పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారులు, పాలకులకు సైతం పనుల గురించి తెలియజేస్తాం. భక్తుల సౌకర్యార్థం కోసం కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఆయా దిశగా భవిష్యత్తు కార్యాచరణను సైతం రూపొందిస్తాం.**

**రాపాక సత్యనారాయణ, ఆలయ చైర్మన్, లక్ష్మీ ప్రసన్న, ఈవో**





## కార్మిక హక్కుల్ని హరించే
# లేబర్ కోడ్ లను రద్దు చేయండి

**పాలకుర్తి వాణి, పాలకుర్తి టౌన్ :** కార్మిక హక్కుల్ని హరించే లేబర్ కోడ్ లను రద్దు చేయాలని సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు చిట్యాల సోమన్న డిమాండ్ చేశారు.మంగళవారం పాలకుర్తిలో సార్వత్రిక సమ్మె కరపత్రాలను ఆయన కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం వేతనాల కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తిపరమైన భద్రత ఆరోగ్యం పని పరిస్థితుల పేరుతో తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేయాలనే నిర్ణయం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఐదేళ్లుగా కోడ్ లను రద్దు చేయాలని అనేక రూపాల్లో పోరాటాలు, సమ్మెలు నిర్వహించామన్నారు. కానీ కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు లాభం కోసం కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు వీలు కల్పిస్తుందని అన్నారు.



# పెద్ది కృష్ణమూర్తి గౌడ్ జన్మదిన వేడుకలు

**పాలకుర్తి వాణి, దేవరుప్పుల :** జనగామ జిల్లా దేవరుప్పుల సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. పెద్ది వర్గం యువసేన ఆధ్వర్యంలో డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అభిమానులు, యువకులు టపాసులు పేల్చి కేకును కోసి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల సాయి ప్రకాష్, మండల యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల అనిల్, వార్డు సభ్యులు చిలుకూరి నర్సయ్య, తోటకూరి రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిపరులను కాపాడేలా
# విచారణ కమిటీ: ఎస్ఎఫ్ఐ

**పాలకుర్తి వాణి. హనుకొండ :** కాకతీయ విశ్వవిద్యాలయంలో అవినీతి ఆరోపణలపై ఏర్పాటు చేసిన విచారణ కమిటీ రెండు మూడు నెలలు గడిచినా నివేదిక ఇవ్వకపోవడం వెనుక అవినీతిపరులను కాపాడే ప్రయత్నం ఉందని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. పరిపాలన భవనంలోని వైస్ ఛాన్సలర్ చాంబర్ ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వీసీ ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రానికి వినతిపత్రం అందజేశారు. హాస్టళ్లలో ఆహారం, మౌలిక వసతుల కొరత, తప్పుడు లెక్కలు, వర్కర్ల కొరత వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. విచారణ కమిటీ తక్షణమే నివేదిక ఇచ్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టాలిన్, మంద శ్రీకాంత్, మల్లేష్, రణదీప్, సురాజ్, పవన్, రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341